క్లుప్తంగా

నిమ్మనపల్లె జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్‌గా శ్రీధర్‌రెడ్డి

నిమ్మనపల్లె : నిమ్మనపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గా కె.శ్రీధర్ రెడ్డి బాధ్యతలు చేపట్టి శుక్రవారం పూర్తిస్థాయి విధుల్లో పాల్గొన్నారు. తిరుపతి జిల్లా వడమాలపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పని చేస్తూ పదోన్నతిపై నిమ్మనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఆయన ఇంటర్మీడియట్ పరీక్షల విధుల్లో భాగంగా తిరుపతిలో పని చేశారు. శుక్రవారం ఇంటర్మీడియట్ ఫలితాల ప్రకటన సందర్భంగా కళాశాలకు వచ్చారు. ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థిని సి.సమీరాను అభినందించారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

నిమ్మనపల్లె : నిమ్మనపల్లె జడ్పీ హైస్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు రాజేంద్ర కుమార్‌ను హెచ్‌ఎం అంజద్‌అలీ ఖాన్ ఉపాధ్యాయ బృందంతో కలిసి శుక్రవారం సన్మానించారు. దూరదర్శన్ ఛానల్లో పీఎం–ఈ విద్య కార్యక్రమంలో భాగంగా ఈనెల 11వ తేదీన ఉపాధ్యాయుడు రాజేంద్ర కుమార్ 'పరీక్షలలో ఆత్రుతను ఎలా తగ్గించుకోవాలి' అనే అంశం పై విద్యార్థులకు ఉపన్యాసం ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ఎంపికై ప్రతిభ చూపి, పాఠశాలకు గుర్తింపు తీసుకురావడంతో రాజేంద్రకుమార్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

ఆదర్శ డిపోగా తీర్చిదిద్దుదాం

మదనపల్లె సిటీ : ఆర్టీసీ–1 డిపోను ఆదర్శ డిపోగా తీర్చిదిద్దుతామని డీఎం మూరే వెంకట రమణారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక డిపో కార్యాలయంలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మార్చి నెలలో ఓఆర్ 70, కెఎంపిఎల్ 5.45 సాధించి రీజియన్ నందు మొదటి స్థానం నిలిచిందన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన టార్గెట్ ఆదాయంలో కండక్టర్లు పీవీ గోపాల్, పీవీ రమణ, శారద, ఈపీకెలో 47.04 సాధించిన డ్రైవర్ ఎల్లప్ప, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల లో ఈపీకె 50.16 తెచ్చిన కండక్టర్ పి.వి.రమణ, పల్లె వెలుగు సర్వీసులోఅత్యధిక ఈపీకె 46.48 తెచ్చిన కండక్టర అనసూయ, గ్యారేజ్‌లో మెకానిక్‌లు నాగరాజు, రాజశేఖర్, అత్యధిక కెఎంపిఎల్ తెచ్చిన డ్రైవర్ పి.వి.రమణ ప్రశంసాపత్రం, నగదు బహుమతులు అందజేశారు.

364 మందికి వైద్యపరీక్షలు

పీలేరు రూరల్ : మండలంలోని రేగళ్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 364 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు డాక్టర్ పి. సతీష్‌కుమార్, డాక్టర్ బి. శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. పలువురికి రక్తపోటు చెకప్, షుగర్, మలేరియా, డెంగీకి సంబంధించి రక్తపరీక్షలు, కంటి పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

సంక్షేమ సారథిని ఆశీర్వదించండి

కలకడ : సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ఆశీర్వదించాలని వాల్మీకిపురం మాజీ జెడ్పీటీసీ సభ్యులు చింతల శివానందరెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని నడిమిచెర్ల పంచాయతీ వడ్డిపల్లె, కొత్తపల్లె, అగ్రహారం, మాదినేనిపాళ్యెం, హరిజనవాడ, నడిమిచెర్ల గ్రామాలలో ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి, రాజంపేట పార్లమెంటు సభ్యులు పివిమిథున్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఎంపీపీ శ్రీదేవి, సర్పంచ్ నల్లమ్మ నరసింహారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు క్రిష్టారెడ్డి, కమలాకర్‌రెడ్డి, సింగల్‌విండో అధ్యక్షులు వెంకట్రమణరెడ్డి, సచివాలయ కన్వీనర్ మోహన్ రాజ్, హరినాథరెడ్డి, జివికిషోర్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం

కురబలకోట : వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారాన్ని శనివారం నుంచి మండలంలోని తెట్టు వేణుగోపాలస్వామి గుడిలో పూజలు నిర్వహించి ప్రారంభిస్తున్నట్లు జిల్లా నాయకులు నులక మనోహర్ రెడ్డి, ఎంపీపీ బి. దస్తగిరి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ కోళ్ల వాసుదేవరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ఆర్పీ ఈశ్వర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం వారు అంగళ్లలో మాట్లాడుతూ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి గెలుపే లక్ష్యంగా ప్రచారాన్ని పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

పెద్దతిప్పసముద్రం: మండలంలోని రాపూరివాండ్లపల్లి పంచాయతి ఉప్పరవాండ్లపల్లికి చెందిన ఇమ్మానుయేలు కుమార్తె లియోనా (11) అనే బాలిక ప్రమాదవశాత్తు చెరువులో జారి పడి గురువారం మృతి చెందిన విషయం విదితమే. శుక్రవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి బాలిక మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం బాలిక కుటుంబ సభ్యులను పరామర్శించి విచారం వ్యక్తం చేశారు.

అక్రమ బోరు సీజ్

గుర్రంకొండ : తాగునీటి బోరుకు దగ్గరలో అక్రమంగా వేసిన వ్యవసాయ బోరును అధికారులు సీజ్ చేశారు. ఈ సంఘటన మండలంలోని టి.రాచపల్లె పంచాయతీ ఎగువబురుజు పల్లెలో చోటు చేసుకుంది. జేసీ ఆదేశాలకు శుక్రవారం తహసీల్దార్ శ్రీనాథ్ ఆధ్వర్యంలోని అధికారుల బృందం గ్రామానికి చేరుకొన్నారు. దళితవాడకు దగ్గరలో వ్యవసాయ పొలం ఉన్న బోరుకు ముందుగా విద్యుత్ కనెక్షన్‌ను తొలగించారు.

ఇంటర్ ఫలితాల్లో సర్కారీ ఆణిముత్యాలు

వీరు మట్టిలో మాణిక్యాలు..సాధారణ పరిస్థితుల మధ్య పెరుగుతూ వెలుగులు చిందిస్తున్న జ్యోతులు. పేదరికం ప్రతిభకు ఏ మాత్రం అడ్డుకాదని నిరూపిస్తున్న ధీరులు. చదువుపైనే గురి పెట్టి లక్ష్యం సాధించిన విజేతలు. ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో మార్కులతో ప్రకాశించిన ప్రతిభావంతులు. కార్పొరేట్ సంస్థ విద్యార్థులకు ఏమాత్రం తీసిపోమని చాటిన మదనపల్లె ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ విద్యార్థినులు. ప్రభుత్వబడులో చదివే వారికి స్ఫూర్తిదాతలు... ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ బాలికల కాలేజీ విద్యార్థినులు రాణించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడంతో ఈసారి మెరుగైన ఫలితాలు వచ్చాయి.

ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులు



సి. సాయిప్రభాష్ (ఎంపీసీ 983) కేవీపల్లె
ఎం. కుమార్ (ఎంపీసీ 980) కేవీపల్లె
సోమేశ్వర్‌నాయక్ (ఎంపీసీ 965) పీలేరు
గీతామాధురి (బైపీసీ 964) మదనపల్లె
సి. సమీర (952 ఎంపీసీ) నిమ్మనపల్లె
డి.మస్తాన్ (ఎంపీసీ 949) కలదర
ఇస్రత్‌బాను (బైపీసీ 918) కలకడ
నందిని (ఎంపీసీ 954) మదనపల్లె
స్వప్న (బైపిసి 954) మదనపల్లె
సమీరాకౌసర్ (సీఈసీ 951) మదనపల్లె
సి. కీర్తి భాయ్ (935) నిమ్మనపల్లె
జే.హారిత (ఎంపీసీ 916) పీటీఎం
కిరణ్మయి (ఎంపీసీ 914) తంబళ్లపల్లె
బి.సంజన (884, బైపిసి) నిమ్మనపల్లె

ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులు



పి. పవన్‌కుమార్ (ఎంపీసీ 464) కేవీపల్లె
ఎం. గురువర్ధన్ (ఎంపీసీ 460) కేవీపల్లె
షాబుల్ ఫిర్దోస్ (బైపీసీ 431) మదనపల్లె
తల్లితో లక్ష్మీభవానీ (ఎంపీసీ 423) మదనపల్లె

- ప్రభుత్వ బాలికల కాలేజీలో ఉత్తమ ఫలితాలు
- ప్రతిభలో రాణించిన పేదింటి పిల్లలు
- కార్పొరేట్ సంస్థకు దీటైన సమాధానం
- ఇంటర్‌లో రాణించిన ప్రతిభావంతులు

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం చంద్రకాలనీకి చెందిన ఉప్పు రాయుడు, లావణ్యల కుమార్తె యు.గీతామాధురి. వీరు చేనేతమగ్గం నేస్తూ జీవిస్తున్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో బైపిసి చదివింది. ద్వితీయ సంవత్సరంలో 964 మార్కులు సాధించింది. 1–10 వరకు స్థానిక మాయబజార్‌లోని వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చదివింది. చదువుల్లో బాగా రాణించి ఇంటర్మీడియట్‌లో ప్రభుత్వ బాలికల కాలేజీలో చేరి తన ప్రతిభను చాటింది. బీఎస్సీ నర్సింగ్ చేసి సేవ చేయాలన్నదే తన ధ్యేయమని గీతామాధురి తెలిపింది.

చేనేత కార్మికుడి ఇంట..

మదనపల్లె పట్టణం మాయబజార్‌కు చెందిన చేనేత కార్మికుడు ఆనందకుమార్, శకుంతల కుమార్తె లక్ష్మిభవానీ. స్థానిక ప్రభుత్వ బాలికల కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతుంది. ఎంపిసి మొదటి సంవత్సరంలో 423 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. 1–10 వరకు స్థానిక మయాబజార్‌లోని వివేకానంద మున్సిపల్ పాఠశాలలో చదివింది. ఇంటర్‌లో మంచి మార్కులు సాధించి ఇంజనీరింగ్ కోర్సు చేయాలన్నదే తన ధ్యేయమని లక్ష్మిభవానీ చెబుతోంది.

సీఈసీలో టాపర్ సమీరా కౌసర్

చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదివి సీఈసీలో టాపర్‌గా నిలిచింది సమీరా కౌసర్. మదనపల్లె పట్టణం బాబుకాలనీకి చెందిన నవాజ్‌బాషా,షేక్ రేష్మా కుమార్తె సమీరా కౌసర్. తండ్రి స్థానిక టమటా మార్కెట్‌లో పని చేస్తున్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో చదివింది. సీఈసీ ద్వితీయ సంవత్సరం చదివింది. 951 మార్కులు సాధించి ప్రతిభను కనబరిచింది. 1–10 వరకు ఉర్దూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చదివింది. తాను సీఏ చేయాలన్నదే లక్ష్యమన్నారు.

చిన్నప్పటి నుంచి చదువులో దిట్ట షాబుల్‌ఫిర్దోస్

చిన్నప్పటి నుంచి షాబుల్ ఫిర్దోస్ చదువుల్లో రాణిస్తోంది. తల్లిదండ్రులు ఎస్‌ఎం సైఫుల్లా, షమీనా సుల్తానాల కుమార్తె షాబుల్ ఫిర్దోస్ స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో బైపిసి మొదటి సంవత్సరంలో 431 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. 1–10 వరకు ప్రైవేటు పాఠశాలలో చదివినా ఇంటర్మీడియట్‌లో ప్రభుత్వ కాలేజీలో చేరి ప్రతిభను చాటింది.

ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ

మదనపల్లె సిటీ: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంల పరీక్షా ఫలితాల్లో మదనపల్లె పట్టణం చంద్రాకాలనీలోని డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ గురుకుల కళాశాల వంద శాతం సాధించింది. ద్వితీయ సంవత్సరంలో 68 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా వీరిలో 65 మంది ప్రథమ శ్రేణిలో, 3 ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరంలో 68 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా వీరిలో 59 మంది ప్రథమ శ్రేణి, 8 మంది ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించి 98.5 శాతం ఫలితాతలు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపిసి గ్రూపులో టి.నందిని 954 మార్కులు, బైపిసిలో ఎ.స్వప్న 973 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరంలో ఎంపిసిలో జీ.కీర్తి 445, బైపిసిలో ఎం.వనజ 423 మార్కులు సాధించారు.

నిమ్మనపల్లె కళాశాల విద్యార్థుల హవా

నిమ్మనపల్లె : ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు సత్తా చాటారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, రెడ్డివారిపల్లె ఆదర్శ పాఠశాల, ముష్టూరు కస్తూర్బా విద్యాలయ విద్యార్థులు ప్రతిభ చూపి ఉత్తమ ఫలితాలు సాధించారు. నిమ్మనపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ 67 మందికి గాను 49 మంది ఉత్తీర్ణత సాధించగా 73 శాతం ఉత్తీర్ణత, సెకండ్ ఇయర్ లో 75 మందికి గాను 66 మంది 88 శాతం ఉత్తీర్ణత సాధించారు. రెడ్డివారిపల్లె మోడల్ స్కూల్లో ఫస్ట్ ఇయర్ 66 మందికి గాను60 మంది విద్యార్థులు, సెకండ్ ఇయర్ లో 70 మందికి గాను 62 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ముష్టూరు కేజీబీవీ పాఠశాలలో ఫస్ట్ ఇయర్ 32 మందికి గాను 23 మంది సెకండ్ ఇయర్ లో 28 మందికి గాను 23 మంది ఉత్తీర్ణత సాధించారు. నిమ్మనపల్లి జూనియర్ కాలేజీ విద్యార్థిని వెంకోజిగారి పల్లెకు చెందిన బావా సాహెబ్ కుమార్తె సి.సమీరా (ఎంపీసీ) సెకండ్ ఇయర్ ఫలితాల్లో 952 మార్కులు సాధించి మండల టాపర్ గా నిలిచింది. 935 మార్కులతో దిగువపల్లి కు చెందిన గోపి సింగ్ కుమార్తె కీర్తి బాయి ఎంపీసీ విభాగంలో రెండవ స్థానం లో నిలిచింది. రెడ్డివారిపల్లె మోడల్ స్కూల్ విద్యార్థిని, అగ్రహారం పంచాయతీ బండమీద పల్లెకు చెందిన బి.సుధాకర కుమార్తె బి.సంజన (బైపిసి)లో సెకండ్ ఇయర్ ఫలితాల్లో 884 మార్కులతో మండలంలో మొదటి స్థానంలో నిలిచింది. హారిక ఎంపీసీ లో 924 మార్కులతో సాధించి ఉత్తమ ప్రతిభ చాటారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో మోడల్ స్కూల్‌కు చెందిన బేబీ (ఎంపీసీ) 447 మార్కులతో, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎం.కీర్తి (ఎంపీసీ) 423 మార్కులతో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. కేజీబీవీ పాఠశాలకు చెందిన విద్యార్థిని జి.మల్లేశ్వరి (సిఇసి) 447 మార్కులతో ప్రతిభ చాటారు.

ఇంటర్ ఫలితాల్లో పీలేరు విద్యార్థుల ప్రతిభ

పీలేరు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలో ఇంటర్ ఫలితాల్లో ఎంపీసీలో ఎం. సోమేశ్వర్‌నాయక్ 965, ఎంఎల్‌టీలో పూజిత 908, సీఈసీలో ఎం. తసీఫ్ 863, బైపీసీలో లలిత 807 మార్కులతో రాణించినట్లు ప్రిన్సిపాల్ వై. వెంకటరెడ్డి తెలిపారు.

ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలు

తంబళ్లపల్లె : ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో 62 మంది విద్యార్థులకు 28 మంది ఉత్తీర్ణులై 40 శాతం ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపల్ సాయిశంకర్‌రెడ్డి తెలిపారు. ఎంపీసీలో రెడ్డిశేఖర్ 359 మార్కులు, బైపీసీలో 358, సీఈసీలో వెంకటరమణ 411 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్‌లో 49 మందికి గాను 30 మంది ఉత్తీర్ణులై 61 శాతం ఫలితాలు సాధించారు. ఎంపీసీలో కిరణ్మయి 914 మార్కులు, బైపీసీలో సాయి విష్ణుస్వరూప్ 814, సీఈసీలో షంషావల్లి 823 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. మోడల్ స్కూల్ విద్యార్థిని సానియా ఇంటర్ ఫస్ట్ ఎంపీసీలో 401 మార్కులు, మానస 469మార్కులు సాధించారు.

మోడల్‌స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ములకలచెరువు : ఇంటర్ పరీక్ష ఫలితాల్లో మోడల్‌స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనభరిచారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 67 శాతం, రెండో సంవత్సరంలో 78 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో సీఈసీ గ్రూపుకు చెందిన దీక్షిత 888, లోహిత 880, లయశ్రీ 872, ఎంపీసీ గ్రూపులో జ్యోతి 877, రెడ్డి తరుణ్ 844, దివ్యశ్రీ 844, బైపీసీలో స్పందన 799 సాధించినట్లు ప్రిన్సిపాల్ కవిత తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో 79 శాతం ఉత్తీర్ణత

పెద్దతిప్పసముద్రం : ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో స్థానిక మోడల్ స్కూల్‌లో మొదటి సంవత్సరం చదివిన విద్యార్థులు 80 శాతం, ద్వితీయ సంవత్సరంలో 79 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ శివకుమారి తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో జే.హారిత 916 మార్కులతో మొదటి స్థానం సాధించిందని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఇంటర్‌లో పెరిగిన ఉత్తీర్ణతా శాతం

పెద్దమండ్యం : మండలంలోని కలిచెర్ల జూనియర్ కళాశాల, కెజీవీబి పాశాల, మోడల్ పాఠశాలల్లో ఇంటర్ పరీక్షా ఫలితాలలో ఉత్తీర్ణతా శాతం పెరిగినట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం వెలువడిన ఫలితాలలో మోడల్ పాఠశాలలో 94 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. మోడల్ స్కూల్‌కు చెందిన శాలిని ఎంపీసీలో 915 మార్కులు, బైపీసీలో 918 మార్కులతో కె మోహనకుమారి ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపల్ రామాంజులునాయక్ తెలిపారు.

గ్యారంపల్లె ఏపీఆర్‌జేసీ ప్రభంజనం

కేవీపల్లె : ఇంటర్మీడియట్ ఫలితాల్లో మండలంలోని గ్యారంపల్లె ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రభంజనం సృష్టించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నకేశవులు తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో మొత్తం 119 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరుకాగా 118 మంది ఉత్తీర్ణులై 99.10 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. మొదటి సంవత్సరంలో 98 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ద్వితీయ సంవత్సర ఎంపీసీ ఫలితాల్లో సి. సాయిప్రభాస్ 983 మార్కులు, ఎం. కుమార్ 980 మార్కులు, ఎన్. శ్రీరాంకేశవతేజ 978, బైపీసీలో నేతాజిసుమంత్ 978, చంద్రశేఖర్ 975 మార్కులతో ప్రతిభ చూపినట్లు చెప్పారు. అలాగే మొదటి సంవత్సరం ఎంపీసీలో 470 మార్కులకు పి. పవన్‌కుమార్ 464, ఎం. గురువర్ధన్ 460 మార్కులు సాధించి ప్రతిభ చూపినట్లు వివరించారు.

సత్తాచాటిన గురుకుల విద్యార్థులు

కలకడ : ఇంటర్ పరీక్ష పలితాల్లో కలకడ ఆదర్శపాఠశాల, కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. కలకడ ఆదర్శ పాఠశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థి డి.మస్తాన్ ఎంపీసీలో 949 మార్కులు సాధించాడు. ఇస్రత్‌బాను బైపీసీలో 918 మార్కులు, జాన్సీలక్ష్మి 911 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరంలో 67 శాతం, ద్వితీయ సంవత్సరంలో 74 శాతం ఉత్తీర్ణ సాధించారు. కస్తూర్బా గాంధి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని నాగరాణి ద్వితీయ ఎంపీసీలో 947 మార్కులు సాధించింది.

సత్తాచాటిన శ్రీ కృష్ణారెడ్డి సిద్ధార్థ

మదనపల్లె : ఇంటర్ పరీక్షా ఫలితాల్లో పట్టణంలోని శ్రీకృష్ణారెడ్డి సిద్ధార్థ విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ... ద్వితీయ సంవత్సరం బైపీసీలో ఎస్.మహేంద్ర 1000 మార్కులకు 985, ఎస్.రుషిత్ 976, ఎంపీసీలో జీ.వంశీకృష్ణ 980, బి.బాలాజీ 976, డి.ప్రసన్న 974, సీఈసీలో గాయత్రి 966 మార్కులను సాధించారన్నారు. ప్రథమసంవత్సరంలో ఎంపీసీలో 470 మార్కులకు ఏ.వెంకటసాయిదీపక్ 465, ఎస్. సుఫియాన్ 465, ఎస్.కావ్యశ్రీ 463, ఆర్.గీతిక 462, ఎస్.స్పందన 460, ఆర్.ఆదిత్య 460, బైపీసీ గ్రూపులో 440 మార్కులకు హరిత 427, జాహ్నవి 424, సీఈసీలో 500 మార్కులకు మదన్‌మోహన్ 465, ఎం.ఐశ్వర్య 463, ఎంఈసీలో 464 మార్కులను సాధించినట్లు తెలిపారు.



విద్యార్థులకు స్వీట్లు తినిపిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణారెడ్డి

ఇంటర్ ఫలితాల్లో జ్ఞానాంబిక ప్రభంజనం

మదనపల్లె : ఏపీ ఇంటర్మీడియట్ బోర్డు శుక్రవారం విడుదల చేసిన ఇంటర్ పరీక్షా ఫలితాల్లో పట్టణంలోని శ్రీ జ్ఞానాంబిక జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్కులతో సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో సి.వాణి 1000 మార్కులకు 987 సాధించి టాపర్‌గా నిలిచింది. అలాగే ప్రథమసంవత్సరం సీఈసీ కోర్సులో ఎస్.వైష్ణవి 500 మార్కులకు 490 సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. సెకండ్ ఇయర్ ఎంపీసీలో కవిత 968, సీనియర్ బైపీసీలో మేఘన 979, ఆర్పాఖానమ్ 973, సీనియర్ ఎంఈసీలో రమ్యప్రియ 887 మార్కులు సాధించారు. సీనియర్ సీఈసీలో హిపసా సాదియా 939, ఎస్ఎంబీ సుహేల్ 931 మార్కులు సాధించి ప్రతిభ చూపారు. జూనియర్ ఎంపీసీలో ఎస్.నజియా 470 కి 463, హిమబిందు 461, జూనియర్ బైపీసీలో ఎస్.నాజియా 426, షాహీనా 423, ఎంఈసీలో లక్ష్మీనరసింహ 488, ఆమని 485 మార్కులు సాధించింది. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ డాక్టర్.ఆర్.గురుప్రసాద్ ప్రిన్సిపాల్ ఆర్.వెంకటాచలపతి అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ డాక్టర్.ఆర్.గురుప్రసాద్

సీఎం జగన్‌తోనే సంక్షేమ రాజ్యం

ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్

మదనపల్లె : రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్ అన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఓటర్లను కోరారు. మండలంలోని కోళ్లబైలు, వైఎస్సార్ కాలనీ పంచాయతీలోని మేకలోళ్లపల్లె, వైఎస్సార్ కాలనీలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, వెలుగుచంద్ర, కోళ్లబైలు సర్పంచ్ ఆనంద్‌రెడ్డి, బండి మనోహర్, ఆనందపార్థసారథి, యువనాయకులు బి.శశాంక్‌రెడ్డి తదితరులతో కలిసి ఇంటింటికీ పర్యటించారు. ఐదేళ్లలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. అన్ని వర్గాలకు సామాజిక న్యాయం జరిగిందని, అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయని వెల్లడించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ కూటమి నేతలు బూటకపు హామీలతో ప్రజలను మోసం చేసేందుకు గ్రామాల్లోకి వస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థిగా నిసార్‌అహ్మద్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ చైర్మన్ తట్టిశ్రీనివాసులురెడ్డి, డాక్టర్. ఏ.వి.సుబ్బారెడ్డి, మయూరిరఘునాథరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ మునిశేఖర్, కౌన్సిలర్లు ఎం.వి.రమణ, ఎస్వీ. రమణ, బయ్యారెడ్డి పాల్గొన్నారు.



మేకలోళ్లపల్లెలో ఓటర్లను అభ్యర్థిస్తున్న నిసార్‌అహ్మద్, తదితరులు

వలంటీర్లపై ప్రతిపక్షాల ద్వంద్వ వైఖరి

పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి : వలంటీరు వ్యవస్థపై ఇన్ని రోజులు విషం కక్కిన ప్రతిపక్షాలు, ఇప్పుడు స్వరం మార్చాయని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి విమర్శించారు. మండలంలోని మర్రికుంటపల్లి, గుట్టపాళెం గ్రామాల్లో శుక్రవారం ఉదయం వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఇన్నాళ్లు వలంటీర్లను నానా మాటలు మాట్లాడి చిన్నచూపు చూశారని, ఎన్నికల సమయం వచ్చేటప్పటికి స్వరం మార్చి రెండు నాల్కుల ధోరణి బయటపెట్టారన్నారు. గత ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికి మేలు చేసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకతను ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజలకు వివరించి చైతన్యపరచాలని పిలుపునిచ్చారు.

పదేళ్ల ప్రజలు ఎందుకు గుర్తుకు రాలేదు..?

కూటమి ఉమ్మడి ఎంపీ అభ్యర్థిగా వచ్చిన కిరణ్ కుమార్‌రెడ్డికి గత పదేళ్లలో ప్రజలు ఎందుకు గుర్తుకు రాలేదని ఎమ్మెల్యే ప్రశ్నించారు. కోవిడ్ విపత్కరకాలంలో కనీసం ప్రజల బాగోగులకు పట్టించుకోని ఆయన ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ప్రజల ముందుకు వచ్చారన్నారు. ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా ప్రజలు వారిని నమ్మేపరిస్థితి లేదన్నారు. రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ పద్మజ, మండల ప్రత్యేక ఆహ్వానితులు శివాజీ, రత్నశేఖర్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, సర్పంచ్ వెంకటరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గుట్టపాళెం గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

విస్తృతంగా ఇంటింటి ప్రచారం

వాల్మీకిపురం: ప్రజలకు మంచి జరగాలంటే మళ్లీ సీఎంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రావాలని మండల పార్టీ అధ్యక్షులు నీళ్లభాస్కర్, మూగలమర్రి సర్పంచ్ భాస్కర్ అన్నారు. శుక్రవారం మండలంలోని మూగలమర్రి పంచాయతీలో ఎం.కొత్తపల్లి, తూర్పుపల్లి, మూగలమర్రి గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్ని వర్గాల సంక్షేమం కోరుతూ పథకాలను అమలు చేస్తున్నారని, కానీ గతంలో టిడిపి ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల ద్వారా కేవలం టీడీపీ నాయకులే దోచుకుని పంచుకున్నారని చెప్పారు. మండలంలోని చింతపర్తి పంచాయతీ చెరువుముందరపల్లి, నాయనివారిపల్లి, కోటపల్లి, తాళ్ళపల్లి, ఎర్రగుంట్లబావి, మేకలవారిపల్లి, గోవింద పురం, రాముల వారిపల్లి గ్రామాల్లో చింతల సాయిక్రిష్టారెడ్డి ఇంటింటికి పర్యటించి, కరపత్రాలను అందించి, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు.

జగనన్నతోనే అన్ని వర్గాల అభివృద్ధి

కేవీపల్లె : ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందినట్లు పీలేరు, కేవీపల్లె మండలాల వైఎస్సార్‌సీపీ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గర్నిమిట్ట పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడంతోపాటు మరెన్నో సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి ఆర్థిక లబ్ధి చేకూర్చారని తెలిపారు. సంక్షేమ పథకాలు యదావిధిగా కొనసాగించడానికి, మరింత అభివృద్ధిని ఆకాంక్షిస్తూ జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అలాగే నిరంతరం ప్రజాసేవకు అంకితమైన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, జెడ్పీటీసీ గజ్జెల శృతి, సర్పంచ్ రమణమ్మ, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, నాయకులు గజ్జెల శీన్‌రెడ్డి, పొత్తపు సతీష్‌రెడ్డి, యర్రమరెడ్డి, నాగ, రామకొండారెడ్డి, వేణుగోపాల్, గౌస్, హరిబాబు, రమణ, రమేష్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం చేస్తున్న పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి

వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా

మదనపల్లె : మండలంలోని తట్టివారిపల్లె గ్రామసచివాలయంలో పనిచేస్తున్న 15మంది వలంటీర్లు తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ భానుప్రసాద్‌కు రాజీనామా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెన్షన్ పంపిణీతో సహా సంక్షేమ పథకాలను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేయకుండా కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశించడం తమకు తీవ్ర మనస్తాపం కలిగించిందన్నారు. దీనికి తోడు తమ నుంచి సెల్‌ఫోన్, సిమ్స్, డివైస్‌లు తీసేసుకోవడం చిన్నతనంగా భావించామన్నారు. కేవలం గౌరవవేతనం తీసుకుని ప్రజలకు సేవ చేసేందుకు తాము విధులు నిర్వహిస్తుంటే.. ఇటీవల ప్రతిపక్షనాయకులు వలంటీర్ల వ్యవస్థను కించపరిచేలా మాట్లాడటం, అనుచిత వ్యాఖ్యలు చేస్తుండటం తమకెంతో ఆవేదనను మిగిల్చిందన్నారు. తాము ఏ రాజకీయపార్టీకి అనుకూలంగా పనిచేయనప్పటికీ, తమను అకారణంగా నిందిస్తుండటంతో స్వచ్ఛందంగా తమ ఉద్యోగాలకు రాజీనామా చేశామన్నారు.

వాల్మీకిపురంలో..

వాల్మీకిపురం: వాల్మీకిపురం మండలం జర్రావారిపల్లి, చింతలవారిపల్లి, నగిరిమడుగు, కూరపర్తి, మూగలమర్రి పంచాయతీలకు చెందిన వలంటీర్లు మూకుమ్మడిగా తమ వలంటీరు విధులకు రాజీనామా చేశారు. రాజకీయ పరంగా వలంటీర్లపై అనవసర ఆరోపనల నేపథ్యంలో తమ విధులు నిర్వహిస్తున్న వలంటీర్లు శుక్రవారం మూకుమ్మడిగా ఎంపిడివో సుధాకర్ రెడ్డికి రాజీనామా పత్రాలను అందించారు.

వంద మంది రాజీనామా

కలకడ : మండలంలో వంద మంది వలంటీర్లు రాజీనామా చేశారు. శుక్రవారం మండలంలోని బాలయ్యగారిపల్లె, కె.బాటవారిపల్లె, ఎనుగొండపాళ్యెం, గంగాపురం, తదితర పంచాయతీలలోని వలంటీర్‌లు వారి రాజీనామా పత్రాలను ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓపీఆర్‌డి లతీఫ్‌ఖాన్ కు అందజేశారు.

19 మంది..

పెద్దమండ్యం : మండలంలోని బండమీదపల్లె, శిద్దవరం గ్రామ పంచాయతీలలో వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. గ్రామాల పరిధిలోని బండమీదపల్లెలో ఉన్న 15 మంది, శిద్దవరంలో 4 వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను గ్రామ సచివాలయంలో ఎంపీడీవో సి వెంకటరమణయ్యకు అందజేశారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీలలో 219 మంది వలంటీర్లు ఉండగా 57 మంది వలంటీర్లు రాజీనామాలు చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

వలంటీర్ల రాజీనామా

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కాట్నగల్లు సచివాలయ పరిధిలో పని చేసే ఆరుగురు వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేసి వినతి పత్రాన్ని ఎంపీడీవో బ్రహ్మానందరెడ్డికి అందజేసారు. వలంటీర్ వ్యవస్థపై చంద్రబాబు,పవన్ కళ్యాణ్ చేస్తున్న దుష్ప్రచారాలు తమను మానసికంగా కుంగదీసినందున తాము స్వచ్ఛందంగా రాజీనామ చేసామని వలంటీర్లు పేర్కొన్నారు.

17మంది రాజీనామా

రామసముద్రం : మండలంలోని అరికె, మానేవారిపల్లి పంచాయతీలలో 17 మంది వలంటీర్లు రాజీనామ చేశారు. ఈ మేరకు శుక్రవారం పంచాయతీ కార్యదర్శికి ఎం.రామకృష్ణకు రాజీనామ పత్రాలను అందజేశారు. ఆర్.నడింపల్లి, మాలేనత్తం, చొక్కాండ్లపల్లి వలంటీర్లు కూడా రాజీనామా చేశారు.

24 మంది..

తంబళ్లపల్లె : మండలంలో 24 మంది గ్రామ వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేసి పత్రాలను ఎంపీడీవో కృష్ణమూర్తికి అందజేశారు. గుండ్లపల్లె సచివాలయం పరిధిలో 9మంది, గోపిదిన్నె 5, పరసతోపు 4, కుక్కరాజుపల్లె 2, కోటకొండ 1, బాలిరెడ్డిగారిపల్లె 1 రాజీనామా చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.